

తీరు మారకపోతే కఠిన చర్యలు

లేపాక్షి ఎంజేపీ హాస్టల్ సిబ్బందిపై మంత్రి సవిత ఆగ్రహం

అపరిశుభ్రతపై మండిపాటు



కొళాయిల వద్ద అపరిశుభ్రతపై మండిపడుతున్న మంత్రి సవిత

లేపాక్షి, ఆగస్టు 27: మండలంలోని మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో అపరిశుభ్రతపై బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లలో కూడా ఇలానే ఉంచుకుంటారా అంటూ హాస్టల్ సిబ్బందిపై మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురుకుల పాఠశాలను మంత్రి మంగళవారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంటగదులు, తరగతి గదుల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు సరిగా శుభ్రం చేయకపోవడంతో పాచిపట్టి జారిపడేలా ఉన్నాయన్నారు. విద్యార్థులు దుస్తులు ఉతికి నిద్రించే గదిలోనే ఆరవేయడంతో సిబ్బందిని అదనపు గదులకోసం ఆరాతీశారు. ఇలా ఉంటే విద్యార్థులు అనారోగ్యం బారిన పడరా అంటూ సిబ్బందిని నిలదీశారు. పురుగులు పట్టిన బియ్యాన్ని పరిశీలించి సిబ్బందిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు అమ్మవారు సోకడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా హాస్టల్ భవనంపైకి ఎక్కించి నాటు వైద్యం చేయిస్తుండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పసరుపూయడం ఏంటని నిలదీశారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురండంటూ విద్యార్థులకు సూచించారు. మంత్రి వెంట ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, టీడీపీ నాయకులు ఉన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఎస్పీ రత్న ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 27: పోలీసులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని, పనితీరు మెరుగు పరచుకోవాలని ఎస్పీ రత్న ఆదేశించారు. పుట్టపర్తిలోని డీపీఓలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్, సర్కిల్, పోలీసుస్టేషన్లలో పనిచేసే రైటర్లకు టెక్నాలజీపై ఒకరోజు అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. కేసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, సీఐలు సతీష్, శ్రీనివాసులు, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఐటీ కోర్ ఇన్‌చారిజ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పండించమన్నారు పట్టించుకోలేదు!

రాగి సాగు చేయాలని ప్రోత్సహించి చేతులెత్తేశారు..

- దిగుబడికి డిమాండ్ ఉంటుందని మాటలు
- గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీలు
- రైతులు పంట పండించాక అమాంతం పడిపోయిన ధరలు
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపు
- పట్టించుకునే నాథుడేడీ?

చిలమత్తూరు, ఆగస్టు 27: అధికారుల మాటలు విని రైతులు నిండా మునిగారు. మార్కెట్లో రాగి దిగుబడికి మంచి డిమాండ్ ఉంటుందనీ, గిట్టుబాటు ధర లభిస్తుందనీ, పంట సాగుచేయాలని ప్రోత్సహించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరతో కొంటామని హామీలిచ్చారు. వారి మాటలు నమ్మి రైతులు తాము పండించే పంటలను వదిలేసి, రాగి సాగు చేశారు. మంచి దిగుబడులు కూడా సాధించారు. అమాంతం ధరలు పడిపోయాయి. ఆ రేటుకు అమ్ముకోలేక దిక్కులు చూస్తున్నారు. పంట సాగుచేయాలంటూ ప్రోత్సహించిన అధికారులు పత్తాలేరు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. దీంతో రైతులు నిండా మునిగారు. తక్కువ ధరకు అమ్ముకోలేక పంట దిగుబడిని ఇళ్లలోనే నిలువ చేసుకున్నారు.



సాగవుతున్న రాగి పంట

ఇళ్లలోనే నిల్వ

మండల వ్యాప్తంగా ఈ ఏడాది రబీలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 251 ఎకరాల్లో రాగి పంట సాగైంది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండు నెలల క్రితం బయట మార్కెట్లో క్వింటా రాగులు ధర రూ.4 వేలపైచిలుకు ఉండేది. రెండు నెలలుగా రాగుల ధరలు తగ్గుముఖం పట్టాయి.

క్వింటా రాగుల ధర రూ.2800 నుంచి రూ.3 వేలకు పడిపోయింది. దాంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.3846 కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం రాగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పండిన ధాన్యాన్ని ఇళ్లలోనే నిల్వ పెట్టుకున్నారు.

అవగాహన కార్యక్రమాలతో సరి

రాగి పంట సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు, ఆ ధాన్యానికి సంబంధించి మద్దతు ధర, కొనుగోలు వంటి విషయాలను మర్చిపోయారు. పండించిన ధాన్యాన్ని సకాలంలో విక్రయించుకునే వెసులుబాటు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. అప్పట్లో ధర క్వింటాకి రూ.3846 ఉండటంతో మంచి ధర లభిస్తుందని ఆశతో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చిన తరువాత గిట్టుబాటు ధర కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చాలామంది రైతులు పక్కనే ఉన్న కర్ణాటకలోని బాగేపల్లి మార్కెట్లో విక్రయిస్తున్నారు. అక్కడ క్వింటా రూ.2800 నుంచి రూ.3 వేలకు అమ్మేసుకుంటున్నారు. ఈ ధరకు అమ్మితే ఏమీ మిగలడం లేదంటున్నారు. ఇప్పటికైనా రాగి ధాన్యం విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారులతో మాట్లాడగా.. గత ఏడాది ఖరీఫ్‌లో సాగైన పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, ఈసారి రబీకి సంబంధించి రైతుల నుంచి ధాన్యం అమ్ముతున్నట్లు సమాచారం రాలేదంటున్నారు. ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఇంట్లో నిల్వ ఉంచుకున్న రాగి దిగుబడి

నిల్వ ఉంచుకున్నాం

రాగులకు మంచి గిరాకీ ఉండటంతో అధికారుల సలహాతో అర ఎకరంలో రాగి సాగుచేశా. పంట బాగానే పండింది. అప్పట్లో ప్రభుత్వం మద్దతు ధర రూ.3846 అని ప్రకటించింది. పండిన ధాన్యం అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. బయట మార్కెట్లో అమ్ముదామంటే క్వింటా రూ.3 వేలులోపే పలుకుతోంది. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వెనక్కు వచ్చే పరిస్థితి లేదు. కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేసి, ఆదుకోవాలి.

-మంజునాథ్, రైతు, కోట్లోపల్లి





ఎకరాకి రూ.30 వేలు పెట్టుబడి: నందకుమార్, రైతు, దేమకేతేపల్లి

ఎకరంలో రాగి పంట సాగుకు రూ.35 వేల వరకు పెట్టుబడి వచ్చింది. దిగుబడి బాగానే వచ్చినా మద్దతు ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. మార్కెట్లో రాగులకు మంచి డిమాండ్ ఉన్నా రైతుల వద్ద చౌకగా అడుగుతున్నారు. క్వింటా రూ.3 వేలకులోపలే అంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే నిల్వ ఉంచుకున్న ధాన్యాన్ని అమ్మకోగలం.

గ్రామ రెవెన్యూ సదస్సులకు సిద్ధం కండి

- జిల్లా కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 27: జిల్లాలో త్వరలో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు ప్రణాళికలతో సిద్ధం కావాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సదస్సులు, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్


సత్యసాయి నీటి పథకాన్ని పరిరక్షించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
- కలెక్టరేట్ వద్ద కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తాగునీటి కార్మికులు

పుట్టపర్తి, ఆగస్టు 27: గ్రామీణ ప్రజలకు తాగునీరు అందిస్తున్న సత్యసాయి నీటి పథకాన్ని పరిరక్షించి, కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా ఓబులు మాట్లాడుతూ.. సత్యసాయి వాటర్ ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓబులు మాట్లాడుతూ.. కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలనీ,పీఎఫ్, ఈఎస్‌ఐ నిధులను ఖాతాలకు జమ చేయాలనీ, సమాన పనికి సమానవేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వాటిని నెరవేర్చకపోతే సెప్టెంబరు 5 నుంచి సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జి డీఆర్వో భాగ్యరేఖకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు మధుసూదన్, ప్రభు, రాంప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.




కాసులిస్తేనే కరెంటు..!

రైతులకు విద్యుత్ కనెక్షన్ కష్టాలు

- డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా అందని ట్రాన్స్‌ఫార్మర్లు
- అధికారుల ఇష్టారాజ్యం
- ఆమ్యామ్యాలు ముట్టజెబితే వెంటనే కనెక్షన్
- పరికరాలను పక్కదారి పట్టించారన్న ఆరోపణలు

గాండ్లపెంట, ఆగస్టు 27: కరువు నేలలో రైతులకు నీరు దొరుకుతుందేమో కానీ, కరెంటు మాత్రం కష్టం. జిల్లా రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేసి, అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్నారు. వర్షాధార వ్యవసాయం చేయలేమని చేతులెత్తేస్తున్నారు. భూమి మీద నమ్మకం మాత్రం వదలట్లేదు. కనీసం బోరు వేసుకునైనా పంటలు పండిద్దామనుకుంటున్నారు. అప్పులు తెచ్చి బోర్లు వేయిస్తున్నారు. చాలా ఫెయిలై, తీవ్రంగా నష్టపోతున్నాడు. నీరు పడడమే గగనం. నీరు పడితే అంతకు మించిన పోరాటం చేయాల్సి ఉంటుంది. కరెంటు కనెక్షన్ పొందాలంటే పెద్ద యాగమే చేయాలి. అప్పులు తెచ్చి, విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు తీస్తున్నారు రైతులు. ఆ తరువాత విద్యుత్ అధికారులు చుక్కలు చూపుతున్నారు. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా విద్యుత్ కనెక్షన్ ఇవ్వరు. స్తంభాలు, వైరు సంగతీ అంతే. కొంతమందికి ఇచ్చినా అదీ అరకొరగానే. పది విద్యుత్ స్తంభాలు అవసరమైన చోట ఏడో, ఎనిమిదో ఇస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఇవ్వకుండా మభ్యపెడుతున్నారు. పూర్తిస్థాయిలో మంజూరైనా రైతులకు ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెబితే మాత్రం వెంటనే ట్రాన్స్‌ఫార్మర్, పరికరాలు ఇచ్చేసి, పొలంలో ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



విద్యుత్ పరికరాల కోసం రైతు చెల్లించిన డీడీ

డబ్బు ఇస్తే.. వెంటనే..

జిల్లాలో భూగర్భజలాలు అడుగంటాయి. రైతుల వ్యవసాయంపై మక్కువతో పొలాల్లో బోరుబావులు తవ్వకుంటారు. మరికొంతమంది మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగు చేసుకోవడానికి బోర్లు తవ్వకుంటారు. నూతన విద్యుత్ కనెక్షన్ల కోసం ఆయాగ్రామాల్లోని సబంధిత లైన్‌మన్, ఏఈలను సంప్రందిస్తారు. తరువాత పొలం వద్దకు వచ్చి రైతులకు కావలసిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రతిపాదనలు పంపుతారు. విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు రూ.లక్షలు విద్యుత్ సంస్థ పేరుతో డీడీలు తీస్తుంటారు. తరువాత విద్యుత్ పరికరాలు అమర్చడానికి నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా ఇవ్వట్లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పరికరాలు సరఫరా కాలేదంటూ రైతులను తిప్పుకుంటున్నారు. విద్యుత్ అధికారులకు డబ్బు ముట్టజెబితే వెంటనే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతున్నట్లు ఆరోపణలున్నాయి.

రేటు కుదిరితేనే వైరు

మండలవ్యాప్తంగా పలువురు రైతులు డీడీలు తీసి, విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ బోర్ల వద్ద రైతులకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చాలంటే లైన్‌మన్, ఏఈలకు డబ్బు ముట్టజెప్పాల్సిందేనని రైతులు ఆరోపిస్తున్నారు. లేదంటే రైతులవైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో చేసేదిలేక రైతులు విద్యుత్ అధికారులు అడిగినంత డబ్బు ముట్టజెప్పి, స్తంభాలు, వైరు, ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుకుంటున్నారు. రైతులే తమ పొలాల వద్దకు స్తంభాలను తరలించుకోవాల్సి వస్తోంది. స్తంభాల గుంతలు కూడా వారే సొంత ఖర్చులతో తవ్వించుకోవాలి. ఇతర వస్తువులు కూడా సమకూర్చుకోవాల్సిందే.

పరికరాల పంపిణీలో గోల్‌మాల్

మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 2023-24లో 80మందికిపైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 మందికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైరు సరఫరా అయ్యాయి. విద్యుత్ వైర్లను సంబంధిత ఏఈ.. రైతులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం రూ.లక్షలు అప్పు చేసి, అధికారులకు ఇచ్చినా, అరకొరగానే పరికరాలు వచ్చాయి.

అరకొరగా పరికరాల పంపిణీ



వ్యవసాయ బోరుకోసం రూ.70వేలకు పైగా డీడీ చెల్లించాం. ఏడాది దాటినా అరకొరగానే విద్యుత్ స్తంభాలు, వైరు అందించారు. ఇంకా రెండు స్తంభాలు, వైరు ఇవ్వాల్సి ఉంది. అధికారులు మాత్రం మొత్తం పరికరాలు అందించామంటున్నారు. అధికారుల ప్రణాళిక మేరకు కూడా ఇవ్వలేదు. తనకు రావలసిన పరికరాలు ఎవరికిచ్చారో అర్థం కావడంలేదు.

-హనుమంతరెడ్డి, కుమ్మరవాండ్లపల్లి

డీడీ తీసి.. నెలలు గడిచినా..

కత్తివారిపల్లి వద్ద ఇటీవల పొలం కొనుగోలు చేశాం. అందులో ఉద్యాన పంటలు సాగు చేయడానికి బోరు తవ్వించాం. విద్యుత్ అధికారుల ప్రతిపాదన మేరకు రూ.1.37 లక్షలు డీడీ కూడా తీశాం. ఆరునెలలు గడుస్తున్నా విద్యుత్ స్తంభాలు మాత్రమే ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైరు ఎప్పుడిస్తారో తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి.

-శ్రీవీణ, మహిళారైతు, వేపరాల

పరికరాలు రాలేదు

మండలంలో విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అరకొరగా పరికరాలు అందించినమాట వాస్తవమే. సంబంధిత కంపెనీలు సకాలంలో పరికరాలు పంపిణీ చేయలేదు. తమకు మంజూరైన వైరు ఇవ్వకుండా పక్కదారి పట్టించారని రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ చేసి, రైతులకు అందిస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఏడీ

భూనిర్వాసిత రైతులను ఆదుకోవాలి

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి
- ఉద్యోగావకాశం కల్పించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్
- పెనుకొండ సబ్ కలెక్టరేట్ ముందు వంటావార్పు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

పెనుకొండ, ఆగస్టు 27: గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ కంపెనీలకు భూములిచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. రైతులకు న్యాయం చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం వంటావార్పు చేపట్టారు. 48 గంటల నిరసనలో భాగంగా తొలిరోజు రాంభూపాల్ మాట్లాడుతూ.. నాసిన్, బెల్ కంపెనీలకు పాలసముద్రం, కావేటి నాగేపల్లి, చిన్నబాబయ్యపల్లికి చెందిన రైతులు భూములిచ్చారన్నారు. మూడేళ్లగా భూసేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, సదరు సంస్థలలో షరతులు లేకుండా నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వాలు తక్కువ పరిహారం ఇచ్చినా భూములు అందజేసి రైతులు సహకరించారన్నారు. భూములు అందించిన వారిలో దళితులు, వెనుకబడిన వర్గాలు, నిరుపేద రైతు కుటుంబీకులు సర్వం కోల్పోయి పునరావాసం కోసం కాళ్లరిగేలా తిరిగి 12 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వంట వండి, అక్కడే భోజనం చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు సుబ్బిరెడ్డి, పెద్దన్న, హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సహాయ కార్యదర్శి గంగాధర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వంటావార్పు చేస్తున్న ఇంతియాజ్, కమిటీ సభ్యులు



అత్యవసరంలో.. అత్యుత్సాహం

- అధికారుల తీరుతో వైద్య సేవలకు ఆటంకం
- నాగముని మృతితో మంత్రి సవితకు అపప్రథ
- బాధ్యతగా వ్యవహరించినా.. బాధాకర సంఘటన

అనంతపురం టౌన్, ఆగస్టు 27: నగరంలోని బీసీ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి తేజ(17) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీసీ శాఖ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే సవిత నేరుగా ఆస్పత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులు, వైద్యులు, పోలీసులతో మాట్లాడారు. అది ఆత్మహత్య కాదని విద్యార్థి తండ్రి అనుమానం వ్యక్తం చేయడంతో సమగ్రంగా దర్యాప్తు చేయాలని, అనుమానాలను నివృత్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా సర్వజన వైద్యశాల అత్యవసర విభాగంలో సోమవారం రాత్రి కొన్ని గంటలపాటు రద్దీ ఏర్పడింది. ఇదే సమయంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి రెఫర్‌పై మెరుగైన వైద్యం కోసం వచ్చిన నాగముని(54) అంబులెన్స్‌లోనే ప్రాణాలు విడిచారు. మంత్రి, శింగనమల ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరుల రాక కారణంగా అత్యవసర

మంత్రే కారణమా..?

మంత్రి సవిత ఆస్పత్రికి రావడంతోనే నాగమునికి సకాలంలో వైద్యం అందలేదని కొందరు విమర్శలకు దిగారు. తన శాఖ పరిధిలో జరిగిన ఘటన గురించి తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయి రావడం మంత్రి బాధ్యత. ఒకవేళ మంత్రి అక్కడికి రాకపోయుంటే.. ఆమెపై ఇంకోరకమైన విమర్శలకు దిగేవారు. మంత్రికి ఆమాత్రం బాధ్యత లేదా అని ప్రశ్నించేవారు. ఇదంతా రాజకీయం. కానీ ఆస్పత్రి ఆవరణలో నాగముని మరణం క్యాజువాలిటీ దుస్థితికి, వీఐపీల పర్యటన సమయంలో అధికారులు ప్రదర్శించే అత్యుత్సాహానికి అద్దం పడుతోంది. హాస్టల్ విద్యార్థి తేజను రాత్రి 7.40 సమయంలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు.. 8.15 సమయంలో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆ వెంటనే విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించాలి. కానీ గంటల తరబడి అత్యవసర విభాగంలోనే ఉంచారు. సాధారణ పరిస్థితుల్లోనే మంచానికి ముగ్గురు నలుగురు రోగులు అక్కడ కనిపిస్తారు. వారికి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు, సిబ్బంది తంటాలు పడుతుంటారు. అలాంటి చోట మృతదేహాన్ని గంటల తరబడి ఉంచడానికి కారణం ఎవరు..? గతంలోనూ క్యాజువాలిటీలో ఓ మృతదేహం ఉన్న పడకపై గంటల తరబడి ఇద్దరు యువకులకు వైద్యం చేశారు. మృతదేహాలను గంటల తరబడి పడకలపై ఉంచడం ఆనవాయితీగా పెట్టుకున్నారా..?

క్యాజువాలిటీలో గంటల తరబడి మృతదేహం



జిల్లా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ బాధితులకు చికిత్స అందించే క్యాజువాలిటీ విభాగం ఇదే

విభాగం వద్ద విపరీతమైన రద్దీ ఉన్నింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న నాగమునికి సకాలంలో వైద్యం అందలేదు. సుమారు అరగంటపాటు నాగముని గురించి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదన్న విమర్శలు వచ్చాయి.

అధికారుల అత్యుత్సాహం

విద్యార్థి మృతదేహాన్ని అత్యవసర విభాగం నుంచి మార్చురీకి తరలించి ఉంటే.. మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు అక్కడికే వెళ్లి చూసేవారు. బాధితులతో అక్కడే మాట్లాడేవారు. కానీ, అత్యవసర వైద్యసేవలు అందేచోట అధికారులు సీన్ క్రియేట్ చేశారు. విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించబోతుంటే.. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి ఒకరు అత్యుత్సాహం ప్రదర్శించారు. 'మంత్రి వస్తున్నారు.. ఇక్కడే ఉంచండి..' అని వైద్యులు, సిబ్బందిని ఆయన వారించారు. పైగా భద్రత పేరిట క్యాజువాలిటీ మెయిన్ డోర్‌నే మూసివేయాలని కూడా సూచించారు. అత్యవసర రోగులు వస్తుంటారని, అలా చేయొద్దని మీడియా ప్రతినిధులు కొందరు సూచించడంతో మిన్నకుండిపోయారు. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరులు రాత్రి 10-40 గంటలకు ఆస్పత్రికి వచ్చారు. 11-30 గంటల వరకూ అక్కడే ఉన్నారు. అంటే.. విద్యార్థి మృతదేహాన్ని రాత్రి 8.15 నుంచి సుమారు మూడున్నర గంటలపాటు అత్యవసర విభాగంలోనే ఉంచారు. ఇది మిగిలిన రోగులకు, వైద్యు లు, సిబ్బందికి ఇబ్బంది కలిగిస్తుందన్న ఆలోచన అధికారులు చేయలేదు. అత్యవసర వైద్యం కోసం వచ్చేవారికి రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులకు తెలియదా..? అత్యుత్సాహం ప్రదర్శించి మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించారు.

తేలేదాకా పోస్టుమార్టం వద్దు: కుటుంబ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్: 'మా బిడ్డ మృతిపై అనుమానాలున్నాయి. ఏవరో ఏదో చేశారు. నిజానిజాలు తేల్చేవరకూ పోస్టుమార్టం చేయనివ్వం' అంటూ విద్యార్థి తేజ కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాల ఎదుట రోడ్డుపై మంగళవారం ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్యాధికారులు, తహసీల్దారు తదితరులు మార్చురీ వద్దకు వచ్చారు. అప్పటికే పాలవాయి గ్రామం నుంచి తేజ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. తేజ మృతిపై అనుమానాలున్నాయని, నిజాలే తేలేవరకూ పోస్టుమార్టం చేయవద్దని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో గందరగోళం ఏర్పడింది. అక్కడి నుంచి బాధితులు ఆస్పత్రి బయటకు వచ్చి రోడ్డుపై నిరసనకు దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన కొనసాగింది. డీఎస్పీ ప్రతాప్‌కుమార్ వారికి సర్దిచెప్పి, పోస్టుమార్టానికి ఒప్పించారు. ఆందోళన కారణంగా ఉదయం జరగాల్సిన పోస్టుమార్టం మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని విద్యార్థి కుటుంబ సభ్యులకు డీఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.



ప్రభుత్వ ఆస్పత్రి బయట రోడ్డుపై నిరసన చేపట్టిన విద్యార్థి కుటుంబ సభ్యులకు సర్ది చెప్తున్న పోలీసులు

అంబులెన్స్‌లోకి వెళ్లి పరీక్షించారు



ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగముని పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. రాత్రి 10-50 గంటల సమయంలో అంబులెన్స్ వచ్చింది. ఆ సమయంలో క్యాజువాలిటీలో మంత్రి, కలెక్టరు, ఎస్పీ తదితరులు విద్యార్థి తేజ మృతదేహాన్ని పరిశీలిస్తున్నారు. సీరియస్ పేషెంట్ వచ్చారని తెలియగానే డ్యూటీ డాక్టర్ కార్తీక్ రెడ్డి 11 గంటల సమయంలో అంబులెన్స్‌లోకి వెళ్లి పరీక్షించారు. అప్పటికే నాగముని బాడీ నుంచి పల్స్ కనిపించలేదు. 11-15 గంటలకు క్యాజువాలిటీలోకి తీసుకువచ్చాం. ఈసీజీ తీసి మృతిచెందినట్లు నిర్ధారించాము. అంబులెన్స్‌లో ఇక్కడికి వచ్చేలోగానే నాగముని చనిపోయి ఉండొచ్చు. చికిత్స విషయంలో నిర్లక్ష్యం చేయలేదు. విద్యార్థి తేజ మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఒప్పుకోలేదు. అప్పటికి మంత్రి వస్తున్నారని తెలియడంతో సందర్శించి వెళతారని క్యాజువాలిటీలోనే ఉంచాము.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

స్వీయ నియంత్రణ పాటించాలి..

బీసీ విద్యార్థి అనుమానాస్పద మృతితో మంత్రి సవిత వెంటనే స్పందించారు. న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఇంత బాధ్యతగా వ్యవహరించినా.. ఆమె ఆస్పత్రిలో ఉన్న సమయంలో రద్దీ కారణంగా ఒకరికి సకాలంలో వైద్యం అందలేదని, అందుకే ప్రాణం పోయిందన్న విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు ఇలాంటివి సాధారణమే అయినా, ప్రజా ప్రతినిధులు తమ పర్యటనల సందర్భంలో స్వీయ నియంత్రణ పాటించాలి. వారి మెప్పుకోసం అధికారులు చేసే హడావుడిపై దృష్టి సారించాలి. భారీ కాన్వాయ్, పదుల సంఖ్యలో అనుచరులు వెంట లేకుండా చూసుకోవాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు, విమర్శలు ఎదురుకాకుండా ఉంటాయి. జనం మెప్పు పొందగలుగుతారు. సీఎం చంద్రబాబు మడకశిర పర్యటనను ఎంతో సాదాసీదాగా ముగించారు. తమ నాయకుడిని మంత్రులు స్ఫూర్తిగా తీసుకోవాలి.

న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే అమిలినేని

అనంతపురం ప్రెస్‌క్లబ్: తేజ మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విద్యార్థి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీలో తేజ మృతదేహాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడే ఉన్న పోలీసులు, బీసీ సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడారు. విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చి.. రూ.1.50 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. విద్యార్థి మృతికి గల కారణాలు ఏమిటో దర్యాప్తు చేయించాలని ఎస్పీని కోరుతామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటామని అన్నారు.



విద్యార్థి తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- పలువురు జర్నలిస్టుల నివాళి



శేఖర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబసభ్యులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: ఇటీవల గుండెపోటు మృతి చెందిన టీవీ - 5 కెమెరామన్ శేఖర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక రాంనగర్‌లోని ఓ హోటల్‌లో టీవీ- 5 కెమెరామన్ శేఖర్ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ నాయకులు ప్రసన్నాయపల్లి శ్రీనివాసులు, గంగారామ్, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర్‌నాయుడు, నాగరాజు, రసూల్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, ఏబీఎన్ జిల్లా ఇన్‌చార్జి సురేష్, టీవీ - 5 చంద్ర, సాక్షి శివారెడ్డి, టీవీ- 9 నరేష్, ఐన్యూస్ రామాంజనేయులు, ఎన్‌టీవీ శ్రీనివాసులు, 10టీవీ జగదీష్, కెమెరామెన్ విజయ్, బాబ్జాన్ తదితరులు శేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే సురేంద్ర బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి తగు నిర్ణయం తీసుకునేలా చొరవ చూపుతానన్నారు.

● టీవీ - 5 శేఖర్ కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.1.5 లక్షలు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తరఫున రూ.25వేలు, గౌస్‌మొద్దీన్ రూ.20వేలు, ప్రసన్నాయపల్లి శ్రీనివాసులు రూ.50వేలు, జిల్లా టీవీ -5 జర్నలిస్టుల బృందం రూ.లక్ష, ఇతర జిల్లాల టీవీ-5 ప్రతినిధుల బృందం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.



సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు, జర్నలిస్టులు

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో డ్రిప్ పరికరాల కోసం రైతులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఏపీఎంఐపీ పీడీ కార్యాలయం లోని తన చాంబర్‌లో ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌తో కలిసి డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ ఏడాది జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏపీఎంఐపీ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

ఇసుక రవాణా చేయొద్దు

- సొంత పార్టీ నాయకులకు జేసీపీఆర్ హుకుం

అనంతపురం, ఆగస్టు27 (ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గవ్యాప్తంగా ఇసుక అక్రమంగా రవాణా చేసేందుకు వీల్లేదు. ఇసుక రవాణా చేసి నాకు దూరం కావద్దు' అని సొంత పార్టీ నాయకులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఇసుక రవాణా ఆపాలని ఇదే తన చివరి హెచ్చరికని సొంత పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాదు నుంచి మీడియాకు వీడియో సందేశాన్ని పంపారు. 'నియోజకవర్గంలో 25 మంది దాకా ఇసుకను రవాణా చేసేవాళ్లున్నారు. వారంతా నాకు ఆప్తులు. ఐదేళ్లు నాతో పాటు కష్టపడిన వారే. మళ్లీ మళ్లీ చెబుతున్నా. ఇసుక రవాణా చేయడం మానుకోండి. మీకొక్కరికేనా డబ్బులు. నియోజకవర్గంలో 2.5 లక్షల మంది ఓటర్లుంటే 25 మందికే డబ్బులా..? దూరం చేసుకోవద్దండి. దయచేసి చెబుతున్నా. ఇసుక రవాణా చేయడం మానేయండి. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాను ఆపేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశా' అన్నారు. ఆ క్రమంలో పోలీసులు తనను ఒకరోజు ఉదయం పట్టుకొని జిల్లా అంతా తిప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతోనే పోలీసులు తనను వదిలి పెట్టినట్లు వివరించారు. ఇసుక రవాణాకు టిప్పర్లు పంపిస్తే అవి బయటకు రావు. ఎక్కడైనా పోయి తోలుకోండి. నా నియోజకవర్గంలో తోలేందుకు వీలులేదని టిప్పర్ యజమానులను హెచ్చరించారు. ఏం మీరే డబ్బులు సంపాదించకో వాల్నా.. నేనెంత పోగొట్టుకున్నాను. అయితే ఇలాగే నన్ను చేసుకోమంటారా..? అని ఇసుక రవాణాదారులపై ఆగ్రమం వ్యక్తం చేశారు. ఇసుక అవసరమైతే మున్సిపాల్టీ ద్వారా తోలిస్తా. ఎన్ని పనులైనా చేసుకోవచ్చు. ఇసుక రవాణాను మాత్రం నేనొప్పుకోను. మీరంతా నాకు కావాల్సిన వాళ్లేనన్నారు. మీకు ఇసుక ఎట్ల అమ్మాలో తెలియదు. మీరు ఎవరిని ఉపయోగించుకుంటున్నారో నాకు తెలుసు. పోయిన వైసీపీ ప్రభుత్వంలో ఇసుక ఎట్ల అమ్మాలో ఆ పార్టీ వాళ్లకే తెలుసు. వాళ్ల సహాయం లేకపోతే మీరు ఒక్క ట్రిప్పు ఇసుక కాదు కదా... ట్రాక్టర్ ఇసుక అమ్ముకోలేరన్నారు. ఇంటి నిర్మాణానికి... అభివృద్ధి పనులకు కావాలంటే ఇసుక తోలుకోండి ఎవరూ వద్దన్నారు అని ప్రశ్నించారు. తన కోసం కష్టపడిన వారికి వేరేవిధంగా మేలు చేస్తానని పార్టీ నాయకులకు అభయమిచ్చారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక అక్రమ రవాణాపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే నెల్లూరులో విచారణ జరుగుతోంది. తాడిపత్రిలోనూ జరుగుతోంది. ఇకనుంచి ఎవరూ ఇసుక తోలేందుకు వీల్లేదని ఆయన సొంత పార్టీ నేతలను తనదైన శైలిలో హెచ్చరించారు.



మాట్లాడుతున్న జేసీపీఆర్

యూపీఎస్‌తో ఉద్యోగులకు రెండు విధాలా లబ్ధి: డీఆర్ఎం

గుంతకల్లు, ఆగస్టు27: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)లో ఉద్యోగులకు రెండు విధాల లబ్ధి కలుగుతుందని డీఆర్ఎం విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ నూతన పింఛను విధానంపై కేంద్ర ఉద్యోగులకు వ్యతిరేకత ఉన్న కారణంగా వారి సమస్యల పరిష్కారానికి కేంద్రం యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ప్రవేశపెడుతోందన్నారు. ఇందులో ఉన్న విషయాలను పరిశీలిస్తే ఓపీఎస్ లబ్ధి తోపాటు ఎన్‌పీఎస్‌లో ఉన్న ఉపయోగాలు కూడా ఇందులో ఉన్నట్లు అర్థమౌతోందన్నారు. కేంద్ర ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీంలో పాత పింఛను మాదిరిగానే జీతంలో 50 శాతం పింఛనును కనీస మొత్తంగా ఇస్తారన్నారు. రిటైర్మెంటు సమయంలో ఎన్‌పీఎస్ ప్రకారం షేర్స్‌లో పెట్టిన ఉద్యోగుల కార్పస్ వ్యాల్యూ జీతంలో 50 శాతం కంటే ఎక్కువగా లభించే అవకాశం ఉంటే ఆ ఎక్కువ మొత్తాలనే పింఛనుగా ఇస్తారని వెల్లడించారు. ఉద్యోగి రిటైర్మెంటు కంటే ముందే చనిపోతే ఫ్యామిలీ పింఛనును 50 శాతానికి బదులు 60 శాతం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉద్యోగికి కనీసంగా రూ.30 వేల పింఛను లభిస్తుందన్నారు. ఎన్‌పీఎస్ కింద డివిజన్‌లో 11,700 మంది ఉద్యోగులు, ఓపీఎస్ పరిధిలో 3,313 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. సమావేశంలో సీనియర్ డీపీ జేపే చౌహాన్, సీనియర్ ఫైనాన్స్ మేనేజరు రామిరెడ్డి, డీపీఓ కాప్రైల్ అరోరా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ కుమార్

బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 27: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో మంగళవారం కర్నూలులో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌కు ఇంజనీరింగ్ అధికారులు హాజర య్యారు. కొంత మందికి కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాగా మరి కొంతమందికి అర్ధరాత్రి వరకు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కర్నూల్ సర్కిల్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ గాయిత్రీదేవి పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్-4 ఇంజనీర్ల బదిలీల్లో భాగంగా అనంతపురం ఉమ్మడి జిల్లాతో పాటు కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ, ఏఈ, డీఈలలో 5 సంవత్సరాలు పూర్తి అయిన వారు, పలు కారణాలో రిక్వెస్ట్ పెట్టుకున్న వారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లాలో క్లియర్ వేకెన్సీ ఉన్న స్థానాలకు మాత్రమే బదిలీ ఉద్యోగులను కేటాయించినట్లు తెలిసింది. ఉత్తర్వులు మాత్రం నెలాఖరున వెల్లడించే అవకాశం ఉన్నట్లు పలువురు ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి ప్లేస్‌మెంట్ ఖరారు అయినప్పటికీ వాటిలో మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో నెలాఖరులో వచ్చే ఉత్తర్వులే ఫైనల్ కానున్నట్లు చర్చ జరుగుతోంది.

యూపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జేసీ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, ఆగస్టు 27: యూపీఎస్సీ సెప్టెంబరు 1న నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ-2024 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ ఆదేశిం చారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు జేసీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జేఎన్‌టీయూ కేంద్రంగా ఆదివారం ఉదయం 9-00గంటల నుంచి 11వరకు పేపర్-1, మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు పేపర్-2, సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు పేపర్-3ఒక్కో పరీక్ష నిర్వహిస్తారన్నారు. నగరంలోని కేఎస్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 238మంది అభ్యర్థులు ఈపరీక్షలు రాస్తున్నారని వెల్లడించారు. అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై ఆదేశాలిస్తున్న జేసీ శివనారాయణశర్మ

పెద్దాసుపత్రిలో నిర్లక్ష్యం.. మరొకరి బలి



మరణించిన ఈశ్వరయ్య

అనంతపురం ఆగస్టు 27: జిల్లా సర్వజన వైద్యశాలలో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి ఈశ్వరయ్య (38) అనే రోగి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, వార్డులో ఉన్న ఇతర రోగులు వైద్యులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తిరుగుబాటుతో వార్డులో ఉన్న నర్సులు బయటకు పారిపోయారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. మృతుడి భార్య పద్మావతి తెలిపిన మేరకు, తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య అనారోగ్యంతో మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లా సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయ్యాడు. వైద్యుల సూచన మేరకు హౌస్ సర్జన్లు ఇంజక్షన్లు, మందులు రాసిచ్చి.. బయట తెచ్చుకోమన్నారు. రోగి కుటుంబ సభ్యులు ప్రైవేటు మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వైద్య సిబ్బందికి ఇచ్చారు. కానీ ఎంఎం వార్డులో ఉన్న రోగికి వాటిని వినియోగించలేదు. నర్సులు సాయంత్రం ఇంజక్షన్ వేసేందుకు ప్రయత్నించారు. నరాలు దొరకలేదని చెప్పి వదిలేశారు. ఆ తర్వాత ఈశ్వరయ్య పరిస్థితి విషమించింది. వెక్కిళ్లు ఎక్కువై.. రక్తపు వాంతులు చేసుకున్నాడు. బాధితుడు విలవిలలాడుతుండటంతో డాక్టర్లను పిలిచారు. వారు వచ్చి చూసేలోగా ఈశ్వరయ్య ప్రాణాలు వదిలాడు. దీంతో రోగి కుటుంబ సభ్యులు, వార్డులో ఉన్న ఇతర రోగులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యులు, నర్సులపై మండిపడ్డారు. వారు ఎక్కడ దాడి చేస్తారోనని వైద్యులు, సిబ్బంది వార్డు నుంచి పారిపోయారు. తన భర్త మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని పద్మావతి కన్నీరు మున్నీరయ్యారు, తనకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, ఇళ్లలో పని చేసుకుని బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని బోరున విలపించారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ముదిగుబ్బకు చెందిన నాగముని సంఘటన మరువకనే ఆస్పత్రిలో మరొకరు మృతి చెందడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పది మంది ఎస్ఐల బదిలీ

అనంతపురం క్రైం: జిల్లా పరిధిలో పది మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు డీఐజీ షిమోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.శ్రీనివాస్	ధర్మవరం వన్‌టౌన్	అనంతపురం వన్‌టౌన్
ఎం.రామక్రిష్ణ	అనంతపురం వన్‌టౌన్	వీఆర్ఎస్పీ, అనంతపురం
జి.సుధాకర్‌యాదవ్	వీఆర్ ఎస్పీ, శ్రీసత్యసాయి	అనంతపురం టూటౌన్
సి.సురేంద్రబాబు	అనంతపురం టూటౌన్	వీఆర్,ఎస్పీ, అనంతపురం
వి.రాంప్రసాద్	డీసీఆర్‌బీ, అనంతపురం	అనంతపురం ఫోర్త్ టౌన్
కె.రాంబాబు	పీటీసీ, అనంతపురం	అనంతపురం రూరల్
వై.విజయ్‌కుమార్	వీఆర్, ఎస్పీ, శ్రీసత్యసాయి	ఇటుకలపల్లి పీఎస్
వై.నాగమధు	అనంతపురం ఫోర్త్‌టౌన్	కణేకల్లు పీఎస్
ఆర్.శ్రీనివాసులు	కణేకల్లు పీఎస్	వీఆర్ ఎస్పీ,అనంతపురం
బి.నబీరసూల్	గుత్తి యూపీఎస్	బొమ్మనహాళ్ పీఎస్



స్వామి, అమ్మవార్లకు ఊంజల సేవ

కృష్ణాష్టమి సందర్భంగా ఆస్థాన పూజలు

కదిరి, ఆగస్టు 27: పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం ఆస్థాన పూజలు నిర్వహించారు. ఆలయం ముందు భాగానా ఉన్న క్రిష్ణమందిరంలోని శ్రీకృష్ణునికి అభిషేకం, ఆస్థాన పూజలు, ప్రసాదా వితరణ గావించారు. సాయంత్రం స్వామివారికి ఆలయంలో ఉయాలోత్సవం నిర్వహించారు. బుధవారం ఆలయం ఆవరణంలో ఉట్టి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు



ప్యూర్ టు ప్యూర్ చీరలను గుర్తిస్తున్న అధికారులు

ధర్మవరం, ఆగస్టు 27: పట్టణంలోని పవర్‌లూమ్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. తిరుపతికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్డీడీ (ప్రాంతీయ ఉపసంచాలకుడు) రాజారావు ఆధ్వర్యంలో రాంనగర్, కొత్తపేట, పోతుకుంట వద్దగల పవర్‌లూమ్స్ ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు. రిజర్వేషన్ చట్టం అమలు చేస్తున్నారా, నిబంధనల ప్రకారం చీరలు నేస్తున్నారా తదితర అంశాలపై ఆరాతీశారు. రాంనగర్‌లోని పెద్దరాజు ఫ్యాక్టరీలో ప్యూర్ టు ప్యూర్ చీరలు నేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్డీడీ తెలిపారు. పవర్‌లూమ్స్‌పై ప్యూర్ టు ప్యూర్ నేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మనోహర్, టెక్నికల్ ఆఫీసర్ షణ్ముగం, ఏడీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, ఆగస్టు 27: పట్టణంలోని పార్థసారథి నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చాకలి శ్రీనివాసులు(33) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శ్రీనివాసులు మగ్గం నేస్తూ కుటుం బాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య అపర్ణ, కుమారుడు జశ్వంత్, కుమార్తె జయ శ్రీ ఉన్నారు. కొద్ది రోజుల క్రితం అతని భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఇంటిలో ఎవరు లేని సమయంలో శ్రీనివాసులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు శ్రీనివాసులు ఇంటి వైపుకు వెళ్లారు. శ్రీనివాసులు మృతి చెంది ఉండటాన్ని గమనించి వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాల తెలియాల్సి ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరంరూరల్, ఆగస్టు 27: మండలంలోని రావులచెరువు గ్రామంలో ఆదెప్ప అనే యువకుడి పురుగుల మందుతాగి మంగళవానం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఆదెప్ప గొర్రెలకాపరి. తల్లిదండ్రులు తనకి పెళ్లిచేయలేదనే మనస్థాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తేనెటీగల దాడిలో కార్మికులకు గాయాలు

ధర్మవరం, ఆగస్టు 27: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో ఉన్న తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న ఆరుగురు మున్సిపల్ కార్మికులపై తేనెటీగలు దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ ఉన్న విద్యార్థులను కూడా పరుగులు తీయించాయి. గాయపడిన మున్సిపల్ కార్మికులు పెద్దన్న, వన్నూరప్ప, చంద్రశేఖర్, నగేశ్, శంకర్, రాజును స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు చికిత్స చేశారు.

గాండ్లపెంటలో వరుస చోరీలు

గాండ్లపెంట, ఆగస్టు 27: గాండ్లపెంటలో నెలరోజులుగా వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రైవేటు క్లినిక్, గుజిరీ, టీ దుకాణాల్లో చోరీలు జరగాయి. నాలుగు రోజుల క్రితం ఇంటివద్ద ఉన్న ఓ మోకానిక్ మోటరు, ఆ పక్కనే ఉన్న వాహనంలోని బ్యాటరీలు చోరీ అయ్యాయి. తిరిగి సోమవారం రాత్రి గతంలో చోరీలు జరిగిన గుజిరీ, టీ దుకాణాల్లో మళ్లీ చోరీలు జరిగాయి. టీ దుకాణంలోని మూడు సిలిండర్లు, సింగరేట్లు, ఇతర సామన్లు చోరీ కాగా, గుజిరీ దుకాణంలో పలు సామన్లు చోరీ అయ్యాయి. వీటిపై బాధితులు ఎస్ఐ క్రిష్ణవేణికి ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే దుండగులు ఇలా చోరీలకు పాల్పడుతుండటం విశేషం. మండలంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం.. పోలీసుల నిఘాలేకపోవడం ఇందుకు కారణమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని కోరుతున్నారు.

మోటార్ల దొంగ అరెస్ట్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 27: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటర్ల చోరీకి పాల్పడిన కుంచపు గురుమూర్తిని అరెస్ట్ చేసినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత పేర్కొన్నారు. మంగళవారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ... నల్లమాడకు చెందిన కుంచపు గురుమూర్తి పుట్టపర్తిలో కొంతకాలంగా నివాసముంటూ మోటర్లను దొంగలించేవాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. వడ్డవంక పెట్రోల్ బంకు సమీపంలో కుంచపు గురుమూర్తిని అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద ఉన్న రూ. 94 వేల విలువైన 16 మోటార్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గురుమూర్తిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేసిన ఏఎస్ఐ గంగ న్న, హెడ్‌కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ మురళి, సిబ్బందిని సీఐ అభినందించారు.

పలు ప్రాంతాల్లో 'వికసిత్ భారత్'

తనకల్లు, ఆగస్టు 27: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. నోడల్ అధికారి, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఏటా 15 శాతం వృద్ధి సాధించడానికి సంబంధించిన విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఏఓ శ్రీహరినాయక్, ఎంఈఓ లలితమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల లక్ష్మీదేమ్మ, జయమ్మ, డాక్టర్ ధర్మరాజు, లోకేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ పాల్గొన్నారు.

బుక్కపట్నం: వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై మండలాధికారులకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా పరిశ్రమల అధికారి సయ్యద్‌బాషా మాట్లాడుతూ... మండలంలో ఐదు సంవత్సరాల్లో చేపట్టనున్న పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ సతీష్‌బాబు, ఎంఈఓ గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవం

ధర్మవరం: స్థానిక గాంధీనగర్ సర్కిల్‌లో టీడీపీ కార్యాలయాన్ని టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారని టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అనుబంధ సంఘాలు, తెలుగు మహిళలు, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

చెరువు భూమి ఆక్రమణ

- ఏలుకుంట్లలో యథేచ్ఛగా కబ్జా
- పొలాలకు వెళ్లే దారులూ మూసివేత
- గతంలో అధికారులు హద్దులు చూపించినా పట్టించుకోని వైనం



ఆక్రమణకు గురైన ఏలుకుంట్ల చెరువు భూమి

ధర్మవరంరూరల్, ఆగస్టు 27: మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలోని చెరువు ఆక్రమణకు గురవుతోంది. గ్రామ పొలంలోని 179 సర్వే నెంబర్‌లో 72.27 ఎకరాల్లో ఈ చెరువు ఉంది. అయితే సమీపంలో ఉన్న కొంతమంది రైతులు ఆ చెరువు భూమి ఆక్రమించుకొని సాగు చేసుకొంటున్నారు. నీరు ఆ సాగుభూమిలోకి రాకుండా.. అడ్డుకట్టలు వేసి.. భారీగా గుంతలు తీశారు. అంతేకాకుండా చెరువులోకి వెళ్లే, చెరువు నుంచి ఇతర పొలాలకు వెళ్లే రహదారులను కబ్జా చేసి సాగుచేసు కుంటున్నారన్నారు. దీంతో రానురాను చెరువు విస్తీర్ణం తగ్గుతోంది. దీనిపై గతంలో రైతులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వెళ్లి సర్వేచేసి హద్దులు చూపించి.. చెరువును ఆక్రమిస్తే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అయినా వాటిని పట్టించుకోకుండా చెరువు భూమిని సాగు భూమిగా మార్చుకొంటున్నారు. తరతరాలకు సంబంధించిన చెరువును ఆక్రమణ చేసుకుంటేపోతే భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఆరు ఎకరాల వరకు చుట్టుఉన్న రైతులు ఆక్రమణ చేసినట్లు ఆ గ్రామస్థులే చెబుతున్నారు.

ఈ చెరువులో నీరు నిల్వతో బుడ్డారెడ్డిపల్లి, ఏలుకుంట్ల, తనకం టివారిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావుల రీచార్జ్ అవుతున్నాయి. ఇప్ప టికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

చెరువు భూమిని కాపాడుతాం

ఏలుకుంట్ల చెరువు ఆక్రమణకు గురైనట్లు గతంలో ఒకసారి ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారు. వెంటనే చెరువును పరిశీలించి హద్దులు చూపించాం. మళ్లీ ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి రాలేదు. వీటిపై మళ్లీ చెరువు పరిశీలించి రెవెన్యూ అధికారులతో కలిసి చుట్టూకొలతలు వేసి ఆక్రమణకు గురికాకుండా కాపాడుతాం. భావితరాల కోసం ఉన్న చెరువును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

- భానుబాలాజీ, ఇరిగేషన్ జేఈ, ధర్మవరం

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

ధర్మవరం, ఆగస్టు 27: పట్టణంలోని పలు దేవాలయాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ముందుగా స్వామివారికి సుప్రభాతసేవ, ప్రాతఃకాల ఆరాధనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణునికి విశేష ఉపచారాలతో ఏకాంతంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం బాలుడితో ఉట్టిని కొట్టించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ పొరాళ్ల పద్మావతి, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య పాల్గొన్నారు. అదే విధంగా కొత్తపేట గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. శ్రీకృష్ణుని ప్రతిమకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పూజలు చేశారు.

గాండ్లపెంట : స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం క్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ధర్మవరం లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో బాలుడితో ఉట్టికొట్టిస్తున్న దృశ్యం



గాండ్లపెంటలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



స్టాక్ పాయింట్ వద్ద బారులుతీరిన వాహనాలు

సారు లేక..!

- కొడవండ్లపల్లి స్టాక్ పాయింట్‌లో తిప్పలు
- ఉన్నతాధికారులకు చెప్పకుండా వెళ్లిపోయిన వీఆర్వో
- ఇసుక లోడింగ్‌కు ఇబ్బందులు
- మధ్యాహ్నం వరకు పడిగాపులు

ముదిగుబ్బ, ఆగస్టు 27: వీఆర్వో లేక మండలంలోని కొడవండ్లపల్లి స్టాక్‌పాయింట్‌లో ఇసుక లోడింగ్ ఆగిపోయింది. వాహనదారులు మధ్యాహ్నం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. స్టాక్‌పాయింట్‌లో ఇసుక లోడింగ్‌కు బిల్లులు చూసుకునే స్థానిక వీఆర్వో సాయి బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా కేంద్రానికి మంగళవారం వెళ్లారు. ఉన్నతాధికారులకు చెప్పకుండా వెళ్లడంతో స్టాక్‌పాయింట్‌లో విధులు నిర్వహించేందుకు ఎవరూ లేరు. దీంతో ఇసుక లోడింగ్ ఆగిపోయింది. వినియోగదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి స్టాక్ పాయింట్‌కు చేరుకుని, పరిశీలించారు. మధ్యాహ్నం తరువాత ఇతర రెవెన్యూ సిబ్బందితో ఇసుక లోడింగ్ ప్రారంభించారు. అప్పటికే ఇసుక లోడింగ్ కోసం వాహనాలు పెద్దసంఖ్యలో బారులు తీరాయి.

చేనేత కార్మికులను ఆదుకోండి

ధర్మవరం, ఆగస్టు 27: చేనేత కార్మికులను, పరిశ్రమను ఆదుకోవాలని సీఐటీయూ, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులను ఆదుకోవడం కోసం ఏటా రూ.24 వేలు కార్మికుల ఖాతాలోకి జమచేయాలని, 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో-కన్వీనర్ ఎల్ ఆదినారాయణ, చేనేత సంఘం నాయకుల వెంకటస్వామి పాల్గొన్నారు.

కొనసాగిన తాగునీటి కార్మికుల నిరసన





కొత్తచెరువు, బత్తలపల్లిలో పచ్చగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న తాగునీటి కార్మికులు

పచ్చగడ్డి తింటూ తాగునీటి కార్మికుల నిరసన

కొత్తచెరువు, ఆగస్టు 27: తమకు బకాయి వేతనాలు చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. స్థానిక తాగునీటి పంప్‌హౌస్ వద్ద కార్మికులు పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. ఇందులో ఆ పథకం సంఘం జిల్లా నాయకులు రాము, తదితర కార్మికులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: సత్యసాయి వాటర్ సరఫరా కార్మికులు గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి, జగన్, జయరాం, కేశవ, సిద్దయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని కొత్తపల్లి తండా పంప్ హౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్నంగా, ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్,శంకర్, నాగభూషణ, షామీర్, రామమోహన్‌నరెడ్డి, కేశవ, ఓబిరెడ్డి, బాషా, శ్రీనివాసులు, రామోహన్ పాల్గొన్నారు.



నల్లమాడ మండలం కొత్తపల్లి తండా పంపు వద్ద నిరసన

ఆశా కార్యకర్తలతో పారిశుధ్య పనులు

కదిరి అర్బన్, ఆగస్టు 27: పట్నం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో మంగళ వారం చెత్త, చెదారం శుభ్రం చేయడంతో పాటు గోడలకు రంగులు వేయించారు. బుధవారం సెంట్రల్ టీమ్ రానున్న నేపథ్యంలో ఆశా కార్యకర్తలతో పీహెచ్‌సీ ఆవరణంలో శుభ్రం చేయించడం పలు విమర్శలకు తావిస్తోంది. సాధారణంగా ఆశా వర్కర్లకు పని ఎక్కువగా ఉంటుంది. ఒక్కొక్కరికి రూ. వెయ్యి నుంచి 1200 ఇళ్లను వీరికి కేటాయిస్తారు. గర్భవతులు, బాలింతలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంలో ఆశా కార్యకర్తలది కీలక పాత్ర. అలాంటివారికి అధికారులు ఇతర పనులకు పురమాం ఖంచడంపై ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మెడికల్ అధికారి ప్రమీల దృష్టికి తీసుకెళ్లగా స్వచ్ఛందంగా ఆశాకార్యకర్తలే శుభ్రం చేసినట్లు చెప్పారు.



పట్నం పీహెచ్‌సీలో చెత్త ఊడ్చుతున్న ఆశాకార్యకర్త

అంగన్‌వాడీల పోరాటం చారిత్రాత్మకం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 27: అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం గత వైసీపీ ప్రభుత్వంపై చేసిన పోరాటం చారిత్రాత్మకమని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వద్దనున్న సీపీఎం జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేసు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం అకుంఠిత దీక్షతో 42 రోజులు పోరాటం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్‌వాడీల మీద వేధింపులకు దిగడం భావ్యం కాదన్నారు. అనంతరం అంగన్‌వాడీలు పోరాటానికి సంబంధించిన బుక్‌లెట్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి సీఎస్ శ్రీదేవి, 12 ప్రాజెక్టుల కార్యదర్శులు పాల్గొన్నారు.



బుక్‌లెట్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

ధర్మవరం కళాకారుల ప్రతిభ

ధర్మవరం, ఆగస్టు 27 : మైసూరు దత్తపీఠం శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో కృష్ణాష్టమి సందర్భంగా ధర్మవ రం శ్రీలలిత నాట్యకళానికేతన్ నాట్యకళాకారులు 25 మంది కృష్ణం వందే జగద్గురుం అనే కూచిపూడి నాటికను మంగళ వారం ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన గురువులు, కళాకా రులకు శ్రీవిజయానంద తీర్థ స్వామి జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారని గురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య పేర్కొన్నారు.



విజయానంద తీర్థస్వామి నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్న ధర్మవరం నాట్యకళాకారులు

మృతుడి కుటుంబానికి గోనుగుంట్ల ఆర్థికసాయం

ధర్మవరం, ఆగస్టు 27 : పట్టణంలోని 27వ వార్డుకు చెందిన సాకే రామచంద్ర (55) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ తన వర్గీయుల ద్వారా రామచంద్ర కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుజాతమ్మ, గోనుగుంట్ల వర్గీయులు వీరన్న, చెన్నారెడ్డి, బోడగల గిరిధర్, మల్లాకాల్వ రాముడు, గంధమనేని నారాయణస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ముదిగుబ్బ, ఆగస్టు 27: మండలంలోని మంగళమడక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంగముని (60) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మంగళమడక చేరుకుని వెంగముని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్ చౌదరి, పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, సూర్యశేఖర్ రాజు, మహబూబ్ పీరా, ఆనంద్, తుమ్మల సూరి, గంగాద్రి, కిష్టప్ప పాల్గొన్నారు.

రామగిరిలో క్రీడాపోటీలు

కొత్తచెరువు, ఆగస్టు 27: జాతీయ క్రీడాదినోత్సవం నేపథ్యంలో మంగళవారం రామగిరిలోని క్రీడా వికాస కేంద్రంలో పోటీలను నిర్వహించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ఏటా భారతీయ క్రీడాదినోత్సవం పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఖోఖో, పరుగు పందెం, వాలీబాల్, లాంగ్‌జంప్, షటిల్ పోటీలను పీడీ కోటప్ప, శబరిగిరి ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. విజేతలకు ఈ నెల 29న బహుమతులు అందజేస్తామన్నారు.

విద్యార్థి సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 27: విద్యార్థి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. ఆ సమస్యలు పరిష్కరించేలా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్లజోడు పవన్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు అంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఆఫీస్ బేరర్ అరుణ్, మహేస్, మూర్తి, దేవా పవన్ గణేస్ ధర్నా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు సరిగాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బుక్కపట్నంలో ఏళ్ళు గడుస్తున్నా కళాశాల నిర్మాణానికే పరిమితమైందన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు.

పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి

నంబులపూలకుంట, ఆగస్టు 27: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన యూపీఎస్ వల్ల ఉపాధ్యాయులకు ఏమీ ప్రయోజనం లేదన్నారు. దీని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, రమణనాయక్, మురళి, శివయ్య, షరీఫ్, రహీమ్, రామమోహన్, లాలూసాబ్, వెంకటరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రమణయ్య, ముషిరహమ్మద్ పాల్గొన్నారు.

భూబాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

పుట్టపర్తి, ఆగస్టు 27: విజయవాడలో ఈనెల 28న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూబాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదలు చేశారు. రాష్ట్రంలో భూఆక్రమణలకు గురైన బాధితులు, ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదలు ఈ సదస్సుకు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు, అరుణ్‌కుమార్, షేక్షావలి, గంగాద్రి పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీ

బత్తలపల్లి: మండలంలోని ముస్టురు,పెద్దకొట్టల గ్రామాల్లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లు, మద్యం విక్రేతల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... చిన్న చిన్న గొడవలకు జైలుకు వెళ్తే.. కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. గ్రామాల్లో గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్, ఎస్ఐలు శ్రీనివాసులు, నరేంద్ర పాల్గొన్నారు.



మంత్రి సవితతో టీడీపీ నాయకులు

పాఠశాలలో సమస్యలను పరిష్కరించండి

● మంత్రికి టీడీపీ నాయకుల వినతి

చిలమత్తూరు, ఆగస్టు 27: టేకులోడు బాలికల గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవితను మండల టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం ఆమె లేపాక్షి బాలుర గురుకుల పాఠశాల తనిఖీ చేసి చిలమత్తూరు మార్గాన వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి పెట్రోల్ బంకు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు టేకులోడు గురుకుల పాఠశాల పేద విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతోందని, ఇటువంటి పాఠశాలలో ఇప్పటికీ పలు సమస్యలు నెలకొన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో పాటు, సిబ్బంది నియామకంపై దృష్టి పెడతామని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులను పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేమకేతేపల్లి అంజినప్ప, బేకరీ గంగాధర్, ఈడిగ సోమశేఖర్, నందీషప్ప, అశ్వర్థప్ప, బాలాజీ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, ఆగస్టు 27 : మడకశిర మండలం అచ్చంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. మంగళవారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో వారిని గుండుమల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన రామాంజప్ప, రామకృష్ణ, నాగరాజు, బొజ్జప్ప, మంజునాథ్, అశ్వర్థప్ప, సురేష్‌బాబు, ఎన్.మంజునాథ్ తోపాటు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు రంగనాథ్, సురేష్, కాంతప్ప, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం కమిటీ ఎన్నిక

పెనుకొండ, ఆగస్టు 27: పెనుకొండ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యం సమావేశాన్ని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి రియాజ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షుడిగా లక్ష్మీపతి, గౌరవాధ్యక్షుడిగా ఘనగిరి రియాజ్, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా రాజు, ఉపాధ్యక్షుడిగా కేవీ మల్లికార్జున, ఈసీ సభ్యులుగా మౌలాలి, ఆర్‌కే తిమ్మారెడ్డి, ఉదిత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మంత్రి సవితను కలిసి ప్రైవేట్ పాఠశాలల సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు హాజరయ్యారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హిందూపురం, ఆగస్టు 27: హిందూపురం మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగనున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర తెలిపారు. ఉదయం 10.30కు సమావేశం ప్రారంభం అవుతుందని, అన్నిశాఖల అధికారులతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, ఆగస్టు 27 : దీనదయాల్ స్పర్శ యోజన పతకం కింద 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు స్టాంప్ సేకరణపై అవగాహన కల్పించడంలో భాగంగా దీనదయాల్ స్పర్శ యోజన పరీక్షలకు దరఖాస్తు సెప్టెంబరు 16లోపు అందజేయాలన్నారు. విద్యార్థులకు గతేడాది 60శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఐదు శాతం సడలింపు ఉంటుందన్నారు. రెండు విభాగాల్లో నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవారికి రూ.6వేలుస్కాలర్‌షిప్ అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగాగానీ, పాఠశాల హెచ్‌ఎం ప్రిన్సిపాల్ ద్వారా రూ.200 డిపాజిట్‌చేసి హిందూపురం, ధర్మవరం, ప్రధాన తపాలా కార్యాలయాల ద్వారా కర్నూలు రీజన్‌కు పంపాలన్నారు. పిన్‌కోడ్ 518002, కవర్‌కు పిలాటిలి స్టాంప్‌లు అంటించి స్పీడ్ పోస్టుద్వారా పంపాలన్నారు. వివరాలకు హిందూపురం, ధర్మవరం ప్రధాన తపాలా కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

మడకశిర(అమరాపురం), ఆగస్టు 27: అమరాపురం మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీపై ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో ప్రతి వారం కూలీలను పెంచాలని ప్రత్యేక అధికారి నరసింహమూర్తి తెలిపారు. ప్రతి కూలీకి వంద రోజులు ఉపాధి కల్పించాలన్నారు. రైతులకు హార్టికల్చర్‌లో మామిడిచెట్లు, దానిమ్మ, సపోటా, డ్రాగన్‌ఫ్రూట్ వంటి పండ్ల చెట్లను అందించనున్నట్లు ఏపీఓ జగదీష్ తెలిపారు. పండ్ల తోటల ప్రాముఖ్యతను రైతులకు తెలిపి, ప్రత్యామ్నాయ పంటలుగా ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యంతో పాటు ఆదాయం పండ్లతోటలతోనే సాధ్యమన్నారు. ఎంపీడీఓ భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఏఈ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందించండి

● సమీక్షలో ఎంపీడీఓ

చిలమత్తూరు, ఆగస్టు 27: రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలని మండల అధికారులకు ఎంపీడీఓ నరేష్ కృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో వికసిత్ ఆంధ్ర-2047 ప్రణాళిక తయారీ సమీక్షాసమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వచ్చే 5 సంవత్సరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు నిర్దేశించిన గడువులోగా వారికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఇందులో ఎవరు కూడా నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలురతో సమానంగా బాలికలను చదివించాలి

పెనుకొండ రూరల్, ఆగస్టు 27 : బాలురతో సమానంగా బాలికలను చదివించాలని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రొద్దం ఐకేపీ కార్యాలయంలో 'ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ సమాజంలో మగవారికి తీసిపోని విధంగా మహిళలను తీర్చి దిద్దాలన్నారు. బాల్య వివాహాల కారణంగా తలెత్తే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం విశ్వనాథ్, సీసీలు, ఈఓ లీడర్లు, అంగనవాడీ టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన ఆకతాయిల ఆగడాలు

● పురంలో పెరిగిన బైక్ విన్యాసాలు ● బెంబేలెత్తుతున్న ప్రజలు ● ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్న వైనం



హిందూపురం అర్బన్, ఆగస్టు 27: పురంలో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. ద్విచక్రవాహనాలతో రయ్.. రయ్... అంటూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. సైలెన్సర్‌లు తొలగించి విపరీత శబ్దాలు చేస్తూ స్థానికులను భయాందోళన కలిగిస్తున్నారు. గతంలో జాతీయ రహదారిపై జోరుగా పందేలు వేసుకుని బైక్ రేసులు నిర్వహించేవారు. కొందరు యువకులు తెగబడి పట్టణంలోనే విచిత్ర విన్యాసాలు చేయడం ఆశ్చర్యం. శ్రీకంఠపురం నుంచి రహమత్‌పురం, రైల్వే అండర్ బ్రిడ్జి కింద, మున్సిపల్ కార్యాలయం బైపాస్ రోడ్డు, కొట్నూరు చెరువుకట్టపై, ఆటోనగర్ వద్ద వేగంగా బైక్‌ను ఒంటి చక్రంతో నడుపుతూ ఆగడాలు పెరిగిపోయాయి. సమీపంలో డీఎస్పీ కార్యాలయం, టూటౌన్ స్టేషన్‌లు ఉన్నా వాటి ముందు నుంచే ఆకతాయిలు విన్యాసాలు చేస్తున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం దిగుతున్నారు. సోమవారం రాత్రి ఇదే జరిగింది. స్థానిక రహమత్‌పురం ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఓ ఆకతాయి ద్విచక్రవాహనాన్ని ఒక చక్రం పైకి లేపి వేగంగా నడుపుతున్నాడు. ఇంతలో అటుగా వస్తున్న మున్సిపల్ నీటి సరఫరా విభాగంలో పనిచేసే ఖలీల్.. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని నిలదీశారు. ఆయనపై అల్లరిమూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ఇష్టారాజ్యంగా కొట్టి అతడిని వాహనం నుంచి కింద పడేశారు. దీంతో వాహనం ఆ వ్యక్తి కాలు మీద పడింది. అతడు కేకలు వేయడంతో ఆకతాయిలు అక్కడి నుంచి ఉడాయించారు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడి కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఆకతాయిలు తరచూ పాఠశాలలు, కళాశాలల వద్ద బైక్‌లపై వెళ్తూ ఆడపిల్లలను ఇబ్బంది పెడుతున్నారనీ, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.

అయినా.. మార్పు ఏదీ?

ఇటీవల రిలయన్స్, గురునాథ్ సర్కిల్ మధ్య ఆకతాయి చేసిన విన్యాసానికి చిన్నారి ఆద్య బలైన విషయం తెలిసిందే. అప్పట్లో ప్రజాసంఘాలు, ప్రజలు, విద్యార్థులు నిరసనలు తెలిపారు. తర్వాత పోలీసులు అప్పట్లో కొంత కట్టడిచేశారు. తరువాత షరామామూలే. ఆకతాయిలు మరలా మొదటికి వచ్చారు. రోజూ పోలీసులకు తారసపడుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని సీసీ కెమెరాలు

తరచూ ప్రమాదాలు, దొంగతనాలు, దాడులు జరుగుతున్నా పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం విచిత్రం. కొన్ని ప్రాంతాల్లో ఉన్నా అవి అరకొరగానే పనిచేస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని పట్టురైతుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న పట్టు రైతులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 27: పట్టు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ముత్యాలప్ప మాట్లాడుతూ సోమందేపల్లి మండలంలో వందల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నామన్నారు. కొన్నేళ్లుగా రైతులు పట్టుగూళ్ల పెంపకంపై జీవనం సాగిస్తున్నారన్నారు. పురుగుల మందు, రైతు కూలీలు, ఇతర పెట్టుబడులు ఎకరానికి తడిసి మోపెడవుతున్నాయన్నారు. అయితే మార్కెట్‌లో పట్టుగూళ్లకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కిలో పట్టుగూళ్ల రూ.350 మాత్రమే ధర పలుకుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇన్సెంటీవ్‌లు సైతం ఆపేయడంతో రైతులకు దిక్కు తోచని స్థితి నెలకొందన్నారు. కేజీ పట్టుగూళ్లకు ప్రభుత్వం రూ.700 ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు కిష్టప్ప, నాగరాజు, హనుమంతరాయప్ప, లక్ష్మీనరసప్ప, నరసింహమూర్తి, ఈశ్వరప్ప, భాస్కర్, హనుమంతు, పట్టు రైతులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి : రఘువీరా



పూజలు నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిరటౌన్, ఆగస్టు 27: జీవనంలో భక్తి ఎంతో అవసరమనీ, తద్వారా మానసిక ప్రశాంతత, ముక్తి లభిస్తాయని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రబోధా సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ బజార్‌లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీకృష్ణభగవాన్ ఊరేగింపులో పాల్గొన్న అనంతరం గణేష్ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణభగవాన్‌కు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

హిందూపురం, ఆగస్టు 27: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు మంగళవారం లేపాక్షి మండలంలో చేపట్టినసభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా బీజేపీకి కార్యకర్తలున్నారన్నారు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా భావించి రికార్డు స్థాయిలో చేపట్టాలన్నారు. సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ ఏవీ రమణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి ఆదర్శ్, వెంకటశివప్ప, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు : సీడీపీఓ

మడకశిర(అమరాపురం), ఆగస్టు 27 : బాల్య వివాహాలతో తీవ్ర అనర్థాలు తప్పవని, అలాంటి వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అమరాపురం మండలం హాలుకూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం... బాలికలను చదవనిద్దాం... కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీటీ మహిళా విభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడిబండ ప్రాజెక్టు మహిళా శిశు అభివృద్ధి పథకం అధికారి పద్మావతి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేస్తే అమ్మాయిలు మానసిక శారీరక ఒత్తిడికి గురికావడం, ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోతారన్నారు. బాల్య వివాహాలు చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా లేదా రెండూ విధిస్తామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు చేయాలని ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్‌ఫ్రీనెంబర్లు 1098, 100, 112 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

అభివృద్ధి పనులకు శ్రీకారం


అగళి, ఆగస్టు 27 : మండలంలోని కసాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు పలు పైపులకు కొళాయిలు బిగించారు. ఇటీవల మలేరియా ప్రబలడంతో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పరిస్థితిని ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్టప్ప, వైద్య సిబ్బంది సుబ్బయ్య, మంజుళ, సుదాకర్, గంగిరెడ్డి ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

నేడు మున్సిపల్ అధ్యక్ష ఎన్నిక

పావగడ, ఆగస్టు 27: ఏడాదిన్నర కాలంగావ ఖాళీగా ఉన్న మున్సిపల్ అధ్యక్ష స్థానానికి ఎట్టకేలకు మోక్షం వచ్చింది. బుధవారం అధ్యక్ష స్థానానికి ఎన్నిక జరగనుంది. 2019లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో 20మంది కాంగ్రెస్ సభ్యులు, ఇద్దరు జెడీఎస్, ఒకరు ఇండిపెండెంట్ సభ్యులుగా గెలుపొందారు. కేటగిరిపై అప్పట్లో కోర్టుకు వెళ్లడంతో ఎన్నిక ఆగిపోయింది. అనంతరం అధ్యక్ష పదవి ఎస్సీకి రావడంతో రెండున్నర సంవత్సరాలు ముగ్గురు అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. మిగిలి 14నెలలకు గాను అధ్యక్ష పదవి జనరల్ కేటగిరికి రావడంతో మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ముందుగా మాజీ మున్సిపల్ అధ్యక్షుడు కాంగ్రెస్ సీనియర్ నేత జీఎస్ ధర్మపాల్ కుమారుడు సురేష్‌బాబుకు అధ్యక్ష పదవి కట్టబెట్టే అవకాశాలు అధికంగా కబనడుతున్నాయి. అదే కేటగిరికి చెందిన రవి కూడా పోటీలో ఉండే అవకాశం ఉంది. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడైన 14వ వార్డు నుంచి జనరల్ కేటగిరి నుంచి గెలుపొందిన రాజేష్ కూడా రేసులో ఉండడంతో అధ్యక్షస్థానంపై ఉత్కంఠ నెలకొంది.

పంచాయతీ అధ్యక్షురాలి ఏకగ్రీవం

పావగడ, ఆగస్టు 27: పొన్న సముద్రం గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా సిద్ధ గంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన అధ్యక్ష ఎన్నికలకు ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నట్లు ఎన్నికల అధికారి చంద్రశేఖర్ ప్రకటించారు. సిద్ధగంగమ్మ ఎంపిక పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీఏ నరసింహయ్య, మహేష్‌బాబు, రెడ్డి ఆనంద్‌గౌడ, శ్రీరామ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



అధ్యక్షురాలు సిద్ధగంగమ్మతో సభ్యులు, కాంగ్రెస్ నాయకులు

ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

ధర్మవరం, ఆగస్టు 27: పట్టణంలోని పవర్‌లూమ్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. తిరుపతికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్డీడీ (ప్రాంతీయ ఉపసంచాలకుడు) రాజారావు ఆధ్వర్యంలో రాంనగర్, కొత్తపేట, పోతుకుంట వద్దగల పవర్‌లూమ్స్ ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు. రాంనగర్‌లోని పెద్దరాజు ఫ్యాక్టరీలో ప్యూర్ టు ప్యూర్ చీరలు నేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్డీడీ రాజారావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సారు లేక..!

ముదిగుబ్బ, ఆగస్టు 27: వీఆర్వో లేక మండలంలోని కొడవండ్లపల్లి స్టాక్‌పాయింట్‌లో ఇసుక లోడింగ్ ఆగిపోయింది. వాహనదారులు మధ్యాహ్నం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. స్టాక్‌పాయింట్‌లో ఇసుక లోడింగ్‌కు బిల్లులు చూసుకునే స్థానిక వీఆర్వో సాయి బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా కేంద్రానికి మంగళవారం వెళ్లారు. ఉన్నతాధికారులకు చెప్పకుండా వెళ్లడంతో స్టాక్‌పాయింట్‌లో విధులు నిర్వహించేందుకు ఎవరూ లేరు. దీంతో ఇసుక లోడింగ్ ఆగిపోయింది. వినియోగదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి స్టాక్ పాయింట్‌కు చేరుకుని, పరిశీలించారు. మధ్యాహ్నం తరువాత ఇతర రెవెన్యూ సిబ్బందితో ఇసుక లోడింగ్ ప్రారంభించారు. అప్పటికే ఇసుక లోడింగ్ కోసం వాహనాలు పెద్దసంఖ్యలో బారులుతీరాయి.



స్టాక్ పాయింట్ వద్ద బారులుతీరిన వాహనాలు



కలెక్టర్‌కు ప్రణాళికను అందజేస్తున్న ఎమ్మెల్యే, గుండుమల

సీఎం హామీలపై కలెక్టర్‌తో చర్చ

● భేటీ అయిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, ఆగస్టు 27 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల మడకశిర మండలం గుండుమల పర్యటనలో ఇచ్చిన హామీలపై మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, టీడీపీ నాయకులు గుండుమల తిప్పేస్వామి కలెక్టర్ చేతన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇచ్చిన పలు హామీలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్‌లు, పరిశ్రమల ఏర్పాటు, వక్కమార్కెట్ వంటి హామీలు అమలు సంబంధించి చర్చించినట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వారు తెలిపారు. హామీల అమలుకు ప్రత్యేక ప్రణాళికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● భర్తకు తీవ్రగాయాలు



జయంతి మృతదేహం



ప్రమాదానికి గురైన కారు

పెనుకొండ రూరల్, ఆగస్టు 27: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొడ మండలంలోని పులేకమ్మ ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జయంతి (66) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన వెంకటేష్, భార్య, మరో ఇద్దరితో కలిసి కారులో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నారు. 44వ జాతీయరహదారిపై పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయంతి, భర్త వెంకటేశ్ తీవ్రంగా గాయపడగా స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో జయంతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

పెనుకొండ, ఆగస్టు 27: పెనుకొండ సెబ్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈనెల 29, గురువారం ఉదయం 10గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తికలిగినవారు ఆధార్ జిరాక్స్ కాపీతో నిర్ణయించిన రుసుం ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు పెనుకొండ సెబ్‌స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోరంట్ల, ఆగస్టు 27: పట్టణంలోని ఎస్సీకాలనీలో నివాసముంటున్న సూరప్ప (43) అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పుట్టపర్తి మండలంలోని బుగ్గపల్లికి చెందిన సూరప్ప, కుటుంబం కొంతకాలంగా గోరంట్లలోని ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు తాగుడుకు బానిసై ఈనెల 14న పులేరు రోడ్డులో పనికెళ్లి యల్లమ్మ గుడి వద్ద మైకంలో పడి ఉండగా స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

పల్లెలకు బస్సులు నడపాలని వినతి

గుడిబండ, ఆగస్టు 27 : మడకశిర ఆర్టీసీ డిపో నుంచి గుండుమల, ఎస్. రాయాపురం, మండలపల్లి, శిర, కైమర, రొళ్ల, మండలపల్లి-ఎస్‌ఎస్ గుండ్లు-మడకశిర, మడకశిర-జమ్ములబండ-గుడిబండ-రొళ్ల-ఎంరాయాపురం నైట్ హాల్ట్ సర్వీసులను పునరుద్ధరించాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు. పల్లెకు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వారు వాపోయారు. గతంలో కైమరబస్సు నాలుగు సింగల్స్ ఎస్. రాయాపురం మీదుగా వెళ్లేదని ఆ బస్సు రద్దు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మడకశిర, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్.రాయాపురం గ్రామ ప్రజలు నాగేంద్రప్ప, రామతమన్న, సుబ్బణ్ణ, నటరాజు, శ్రీరామప్ప, సన్నీరప్ప, రాజన్న తదితరులు కోరారు.

పైప్‌లైన్ మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్

రొళ్ల, ఆగస్టు 27: మండలంలోని రత్నగిరి గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇటీవల డయేరియా ప్రబలడంతో మాజీ ఎమ్మెల్సీ గుండుమల ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ బోరు ఉండేచోట నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఈసందర్భంగా డీఈ మనూనాయక్, ఎంపీడీఓ ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, భరత్, ప్రధాన కార్యదర్శి ఈరన్న, రామకృష్ణ, బాలకృష్ణ, టీడీపీ నాయకులు ముదుపేగౌడ్, సిద్ధగంగప్ప తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

మల్లినమడుగులోని ఎస్సీ కాలనీ పైప్‌లైన్ వద్ద తాగునీటి లీకేజీపై అధికారులు స్పందించారు. నీటిలో పందులు స్వైర విహారం చేస్తుండంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పదించారు. పైప్‌లైన్ మార్చి నీటి లీకేజీని అరికట్టారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 27: రొద్దం మండల పరిధిలోని ఎస్సీ కాలనీలో టీడీపీ సీనియర్ నాయకుడు నమస్కారాల వెంకటేశ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు శశిభూషణ్ పటేల్ స్వగ్రామానికి చేరుకుని వెంకటేశ్ భౌతికకాయానికిపూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించి కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, జావిద్, హరీష్, మున్నా, సత్యశేఖర్, శివ, ఈశ్వర్ ఉన్నారు.